క్లుప్తంగా

చంద్రంపాలెం విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు ప్రారంభిస్తున్న వైద్యులు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గాయత్రి వైద్యక ళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ, పీడియాట్రిక్, చర్మ వ్యాధులకు సంబంధించిన పరీక్షలను బుధవారం ప్రారంభించారు. ఇక్కడి 3 వేల మంది విద్యార్థులకు వారం రోజుల పాటు వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు, గాయత్రి కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన



ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థినులు

భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు థింసా నృత్యంలో ప్రతిభ కనబరిచి, ప్రశంసలందుకున్నారు. నెహ్రూ యువకేంద్రం ఇటీవల నిర్వహించిన యువ ఉత్సవ్ జిల్లా స్థాయి గ్రూప్ డ్యాన్స్ విభాగంలో థింసా నృత్యం ప్రదర్శించి, ద్వితీయస్థానంలో గెలుపొందారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని, విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

పద్మనాభం: మండలంలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్ కాంపెక్సు సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలు మెరుగుపరుచుకునేందుకు ఈ సమావేశాలు నిర్వహించారు. రెడ్డిపల్లి, పద్మనాభం, అనంతవరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో.. ఆర్‌వీ పురం, బీఆర్ తాళ్లవలస స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను ఈ సమావేశాలు జరిగాయి.

రీ సర్వేలో సవరణలకు 262 దరఖాస్తులు



మద్దిలో నిర్వహిస్తున్న గ్రామ సభ

పద్మనాభం: మండలంలోని మద్దిలో రీ సర్వేలో తప్పుల సవరణ కోసం బుధవారం నిర్వహించిన గ్రామసభలో 262 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో పేర్లు సరి చేయాలని 227 మంది, విస్తీర్ణం సరి చేయాలని 32 మంది, సరిహద్దు వివాదాలు పరిష్కరించాలని కోరుతూ ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రీ సర్వే డీటీ వరలక్ష్మి, ఆర్‌ఐ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

చోడి సాగుతో అధిక లాభాలు

పద్మనాభం: రైతులు రబీలో రాగి (చోడి) పంట వేసుకోవాలని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని పాండ్రంగిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాగి పంటను తక్కువ పెట్టుబడితో సాగు చేసుకోవచ్చన్నారు. ఈ పంట వల్ల అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. ఏఈవో ఎంవీఎస్ చలం, ఎంపీఈవో రమ పాల్గొన్నారు.



అదాని కొండ వద్ద ప్రభుత్వం నిల్వ చేసిన గ్రావెల్‌ను యథేచ్ఛగా లారీలోకి తరలిస్తున్న దృశ్యం



కొండను తవ్వుతున్న దృశ్యం

కరిగిపోతున్న కొండలు

కొండలను తవ్వి గ్రావెల్, రాయి తరలింపు • ఇప్పటికే 50 శాతం కొండ కనుమరుగు • చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు



కరిగిపోయిన కొండలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం పరిధి ఎస్సీ కాలనీ సమీపంలోని కొండపై తవ్వకాలు జోరందుకున్నాయి. పట్టపగలే మనుషులను పెట్టి కొండను తవ్వి రాయి, గ్రావెల్‌ను యథేచ్ఛగా లారీలపై తరలించేస్తున్నారు. అయినప్పటికీ రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొండలనే కాదు అదానీ కొండపై ప్రభుత్వం గతంలో తవ్వి, నిల్వ ఉంచిన గ్రావెల్‌ను కూడా యథేచ్ఛగా తరలించేస్తున్నారు. స్థానిక సచివాలయ సమీపంలోనే ఇదంతా జరుగుతున్నా, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇక్కడ సర్వే నంబర్ 314లో కొండ ఇప్పటికే 50శాతం తరిగిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పదుల సంఖ్యలో వర్కర్లను నియమించి కొండను తవ్వేస్తున్నారు. దీంతో కొండ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. నిత్యం లక్షల్లో వ్యాపారం చేస్తున్నా, రాత్రి, పగలు అనే తేడా లేకుండా లారీల ద్వారా గ్రావెల్ రాయి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం ఒక కేసు నమోదు చేయడం కానీ, ఒక లారీని సీజ్ చేయకపోవడం గానీ అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారుల సహకారంతోనే ఇక్కడ గ్రావెల్ మాఫియా నడుస్తోందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. నగరపాలేనికి చెందిన పలువురు ఈ కొండను పూర్తిస్థాయిలో ఆక్రమించుకుని, యథేచ్ఛగా గ్రావెల్ దందా నిర్వహిస్తున్నారు. ఇలాగే తవ్వకాలు కొనసాగితే భవిష్యత్తులో కొండలు కనుమరుగైపోతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రావెల్ మాఫియాపై రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తరలించడానికి సిద్ధంగా ఉంచిన రాయి

నిఘా ఏర్పాటు చేస్తాం

నగరపాలెం ఎస్సీ కాలనీ ప్రాంతంలో కొండను తవ్వి గ్రావెల్, రాయి తరలిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటాం. గ్రావెల్‌ను, రాయిని అనధికారికంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తాం.

– ఎం.శ్రీనివాస్, ఏడీ, మైనింగ్

ఆధునిక బోధనా పద్ధతులతో సత్ఫలితాలు

- డైట్ అధ్యాపకుడు నాగేశ్వరరావు
- ఉపాధ్యాయులకు ముగిసిన వృత్యంతర శిక్షణ



ఉపాధ్యాయులకు బోధనా విధానాల గురించి వివరిస్తున్న డైట్ అధ్యాపకుడు నాగేశ్వరరావు

భీమునిపట్నం: మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో పాఠ్యాంశాలను బోధించాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు జి.జి.ఎస్.నాగేశ్వరరావు సూచించారు. దీని ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చన్నారు. భీమిలి పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనకు సంబంధించి భీమిలి మున్సిపల్ హైస్కూల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సులభరీతిలో అర్థమయ్యేలా బోధించాలని, అవసరమైనప్పుడు బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించి సృజనాత్మకంగా బోధించాలని సూచించారు. విద్యార్థులకు బోధిస్తున్న పాఠాలు ఏ మేరకు అర్థమవుతున్నాయి, ఇంకా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలను జాగ్రత్తగా పరిశీలిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు ఉండాలి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందుకు సాగాలంటే ఆంగ్లభాషపై గట్టి పట్టు ఉండాలని నాగేశ్వరరావు అన్నారు. విద్యార్థులంతా ఆంగ్లంలో మాట్లాడే విధంగా వారికి శిక్షణ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివరాణి, జయప్రద, రిసోర్స్‌పర్సన్‌లు రెడ్డిపల్లి అప్పలరాజు, అమర్‌నాథ్, రమాదేవి పాల్గొన్నారు.

నేడు భీమిలిలో జాబ్‌మేళా

భీమునిపట్నం: భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జరిగే జాబ్ మేళాలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, కల్యాణి జ్యువెలర్స్, మాస్ మెరైన్ సర్వీస్ ఇండియా, ఎస్.కె.ఎల్ మొదలైన కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఇంటర్, 10వ తరగతి పూర్తి చేసిన నిరుద్యోగ యువతీయువకులు ఇంటర్వ్యూలకు అర్హులు. ఎంపికైన వారు విశాఖపట్నం, గాజువాక, తగరపువలస, భోగాపురం, గోపాలపట్నం, విజయనగరం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 90147 58949ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బోధనలో మెలకువలు పాటించాలి

డీఈవో ప్రేమ్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

కొమ్మాది: ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. విద్యార్థులలో సామర్థ్యాలను గుర్తించి, ప్రోత్సహించాలన్నారు. 8వ వార్డు గొల్లల ఎండాడలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని వివిధ తరగతుల్లో విద్యార్థుల సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బోధన అందించే విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చూపరాదన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకునే విధంగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కార్తీక దీపోత్సవం



కారుషెడ్ శివాలయం ప్రాంగణంలో దీపాలంకరణ

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి సమీపంలోని శ్రీ కాశీ ఉమా మహేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో బుధవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శివలింగం, స్వస్తిక్, శంఖు చక్రాల ఆకృతులను తీర్చిదిద్ది, దీపాలతో అలంకరించారు. శివలింగాన్ని జగన్నాథుడిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, సూర్యారావు, బాలాజీ నాయుడు, గిరి, వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీకృష్ణ

భీమునిపట్నం: విద్యార్థులు మంచి పుస్తకాలను చదవడం ఒక అలవాటుగా చేసుకోవాలని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా కళాశాల గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక పఠనంతో విజ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బేసిక్‌సైన్స్ విభాగాధిపతి ఆర్.జి.పట్నాయక్, అధ్యాపకులు శ్రీనివాసరావు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురం గ్రంథాలయం వద్ద ఐఐఎం అధికారులు, సిబ్బంది

ఐఐఎం ప్రతినిధుల సందర్శన

మధురవాడ: ఆనందపురం శాఖా గ్రంథాలయాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ప్రతినిధులు బుధవారం సందర్శించారు. గ్రంథాలయ వారోత్సవాలతో భాగంగా వీరు ఇక్కడికి వచ్చి, లైబ్రరీలోని పుస్తకాల వివరాలు తెలుసుకున్నారు. వీరిలో సీనియర్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ఎన్.విష్ణుస్, జూనియర్ సూపరింటెండెంట్ పి.ఇందు, లైబ్రరీ అసిస్టెంట్లు ఎస్.స్వాతి, వి.శ్రీను, బి.కనక మహేశ్వరి ఉన్నారు. గ్రంథాలయానికి 11 ఇంగ్లిష్ పుస్తకాలు బహూకరించారు. లైబ్రేరియన్ అప్పారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పీఎం పాలెం: స్థానిక రామాలయానికి ఎదురుగా ఉన్న 80 అడుగుల రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తూ, ప్రమాదానికి గురైన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పీఎం పాలెంలో నివసిస్తున్న మహమ్మద్ షబానా కుమారుడు మహమ్మద్ ఆసిఫ్ వలీ (22) ఇటీవలే బీబీఏ పూర్తి చేసి, ఎంబీఏకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆసిఫ్ వలీ బుల్లెట్‌పై కారుషెడ్ కూడలి వైపునకు బయల్దేరాడు. వేగంగా వెళ్తూ బైక్ విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో రోడ్డుపై పడి, తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసిఫ్ వలీ తల్లికి సమాచారం అందించడంతో ఆమె కుమారుడికి స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, నగరంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆసిఫ్ వలీ బుధవారం మరణించాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

- ఒకదానికొకటి ఢీకొన్న 4 వాహనాలు
- నలుగురికి స్వల్ప గాయాలు



ముందు భాగం దెబ్బతిన్న పాఠశాల బస్సు

మధురవాడ: ఒక పాఠశాల బస్సు, మరో 3 వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్న ఘటనలో పెద్ద ప్రమాదమే తప్పింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి.. బుధవారం ఉదయం 8 గంటలప్రాంతంలో జాతీయ రహదారిపై బోరవానిపాలెం వద్దకు వచ్చేసరికి మారికవలస నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న కారు రోడ్డుపై హఠాత్తుగా ఆగింది. కారును వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. ఆదే సమయంలో ఫార్మా సంస్థకు చెందిన ఉద్యోగులతో వెళ్తున్న బస్సు లారీని ఢీకొంది. ఆ బస్సును విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్తున్న మరో బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు ఫార్మా ఉద్యోగులు, పాఠశాల బస్సులోని ఓ మహిళా ఉద్యోగి స్వల్పంగా గాయపడ్డారు. ఆదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, వాహనాలు దెబ్బతిన్నాయి. రోడ్డుపై కిలోమీటరు పైనే ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో పాఠశాల బస్సు ఉండడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులంతా సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచారు. యువ ఉత్సవ్–2024లో భాగంగా, ఏపీఎన్ కళాశాలలో నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో బహుమతులు సాధించారు. సామూహిక ప్రదర్శనలో మొదటి బహుమతిగా రూ.7 వేలు, ఐటీసీ విభాగంలో ఏక ప్రదర్శనలో రెండో బహుమతిగా రూ.2 వేలు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ శాంతకుమారి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన అఖిల భారత సహకార వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

పద్మనాభం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని రెడ్డిపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కె.ఎస్.జి.వి.ప్రసాద్ సూచించారు. వారం రోజుల నుంచి జరుగుతున్న అఖిల భారత సహకార వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రెడ్డిపల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘ కార్యాలయంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది నిజాయతీగా పని చేసినప్పుడే సహకార సంఘాలకు పని తీరులో మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసరావు, సహకార కేంద్ర బ్యాంక్ పద్మనాభం బ్రాంచ్ మేనేజర్ బి.వెంకట అప్పారావు, మజ్జివలస సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి పి.సత్య మాధవ్, రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి జి.సోమేశ్వరరావు, రెడ్డిపల్లి, పద్మనాభం సహకార సంఘాల సీఈవోలు ఎం.అప్పారావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది నిజాయితీగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

అవగాహనతోనే సికిల్ సెల్ నివారణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొమ్మాది: చిన్న పిల్లల్లో సికిల్ సెల్ వ్యాధి అధికంగా వ్యాపిస్తోందని, దానిని ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని అరకులోని గిరిజన ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు డా. జి.ధర్మారావు తెలిపారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ భవన్‌లో నిర్వహిస్తున్న జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి ప్రాబల్యంపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాధికి సంబంధించి తీసుకోవలసిన ముందుజాగ్రత్త చర్యలు, పౌష్టికాహారం, వ్యాధి నిర్ధారణ పరీక్షల గురించి వివరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి మందా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతోందన్నారు. గిరిజన ప్రజల్లో అవగాహన చేపట్టడం ద్వారా ఈ వ్యాధి నిర్మూలించవచ్చని, ఇది అందరి బాధ్యత అని తెలియజేశారు. కార్యక్రమంలో సెమినార్ కో ఆర్డినేటర్లు డా. చిక్కాల నాగరాజు, డి.వి.మల్లికార్జున, డా.సోనియా తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

26న బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

భీమునిపట్నం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజావ్యతిరేక విధానాల వల్ల తీవ్ర నష్టం కలుగుతోందని సీఐటీయూ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జీవీఎంసీ కార్యాలయం వద్ద ఈ నెల 26వ తేదీన నిరసన ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను చిట్టివలసలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ విధానాల వల్ల ఇప్పటికే అందరూ ఎంతో ఇబ్బంది పడుతున్నారని, కార్మికులకు కూడా చాలా నష్టం జరుగుతోందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్ కార్మికులకు పింఛన్ పెంచాలి

భీమునిపట్నం: నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుల పింఛన్ పెంచాలని సీపీఐ నాయకుడు కానూరి రాంబాబు కోరారు. తగరపువలసలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరలు, విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయని, కార్మికులు తట్టుకునే పరిస్థితిలో లేరని అన్నారు. ఇందుకోసం వారికి కనీసం రూ.5వేల వరకు పింఛన్ అందించాలని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, సన్నిబాబు, లక్ష్మణరావు, గోవిందరావు, రామారావు, అప్పారావు, వీర్రాజు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణోత్సవ సంబరాలు



ఆలయంలో సర్వతోభద్ర మండపావాహనం



సిద్ధేశ్వరస్వామి పీఠంలో హోమం చేస్తున్న ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలో స్వర్ణోత్సవ సంబరాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ధర్మకర్త ఎ.నరసింహమూర్తి దంపతులు హోమం నిర్వహించారు. సర్వతోభద్ర మండపావాహనం, సకల దేవతా కలశారాధన, హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు దూసి రామలింగ స్వామి శర్మ, పవన్ కుమార్ శర్మ, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గురువారం చండీ యాగం నిర్వహిస్తామని ధర్మకర్త తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

స్వర్ణోత్సవాల్లో భాగంగా పీఠంలో బంకపల్లి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానవాటికనూ వదల్లేదు..

- ఆక్రమణకు పాల్పడిన వ్యక్తితో స్థానికుల వాగ్వాదం
- పోలీసుల రాకతో వెనుదిరిగిన వైనం



స్థానికులు నిలువరించడంతో వెనుదిరుగుతున్న వ్యక్తి

మధురవాడ: విశాఖ రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంతో ఆక్రమణదారులు శ్మశానవాటిక స్థలాన్నీ వదలడం లేదు. అక్కడ కూడా పాగా వేసేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వివరాలివి.. మధురవాడ సర్వే నెంబరు 6లో సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని 6వ వార్డు పరిధి రేవళ్లపాలెం, రిక్షా కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నారు. దీనికి దశాబ్దం క్రితమే జీవీఎంసీ ప్రహరీ గోడ కూడా నిర్మించింది. కొద్ది నెలలుగా రహదారి, షెడ్ వంటివి ఏర్పాటు పనులు కూడా చేపడుతోంది. అయితే, ఇక్కడ సుమారు 200 గజాల స్థలాన్ని 8 నెలలు క్రితం 2 డాక్యుమెంట్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నానంటూ ఓ వ్యక్తి పనులు చేపట్టాడు. శ్మశాన వాటిక ప్రహరీ లోపల స్థలంలో రెండు రోజులుగా తుప్పల తొలగింపు, ఇతర పనులు చేయిస్తున్నాడు. విషయం బయటకు తెలియడంతో రేవళ్లపాలెం, రిక్షా కాలనీలకు చెందిన పెద్దలు సంఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని ప్రశ్నించారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో పీఎం పాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, డాక్యుమెంట్లు పట్టుకుని స్టేషన్‌కు రావాలని సదరు వ్యక్తిని పంపించేశారు. ఏళ్ల తరబడి ఈ స్థలాన్ని శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నామని, ఇప్పుడు ఇక్కడ జిరాయితీ భూమి ఎలా వచ్చిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.